క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బీమా సాయం అందజేత



బాధిత కుటుంబానికి బాండ్ అందజేస్తున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామానికి చెందిన సుభాన్‌బాషా కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఇతనికి వైఎస్సార్ ప్రమాద బీమా ఉంది. దీంతో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన బాండ్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నెట్టేకల్ సర్పంచ్ ఎస్.బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: వైఎస్సార్ రైతు భరోసా పథకానికి ఎవరైనా అర్హులు ఉంటే ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ మండలంలో ఎవరైనా కొత్త రైతులు ఉంటే సమీపంలోని ఆర్బీకేల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 15 నుంచి ఆయా ఆర్బీకేల్లో, సచివాలయాల వద్ద అర్హుల జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

25లోపు కౌలు రైతు కార్డులు పొందండి

కౌతాళం: ఈనెల 25లోపు అర్హులు కౌలు రైతు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌలుదారులకు రైతుభరోసా, రుణాలు అందాలంటే కార్డు తప్పని సరి అన్నారు. మండలంలోని కౌలుదారులు వీఆర్‌ఓను లేదా ఏఏఓను కలిసి తగిన పత్రాలను సమర్పించాలన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

ఆదోని రూరల్ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో ఆదోని నియోజకవర్గ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ ఇన్‌చార్జి నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీప్‌దోకల ఆధ్వర్యంలో బాణసంచా పేలుస్తూ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ పాలనకు కర్ణాటక ప్రజలు చరమగీతం పాడారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు మారుతిరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, నాయకులు దేవిశెట్టి వీరేష్, ఐఎన్‌టీయూసీ ఇర్ఫాన్, నిసార్ అహ్మద్, మద్దిలేటి, సుంకన్న, ఫరూక్ అహ్మద్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

తుగ్గలి: హనుమ జయంతి సందర్భంగా సోమ వారం పగిడిరాయిలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి రూ.25 వేలు, ఎంపీపీ ఆదెమ్మ రంగన్న రూ.20 వేలు, సర్పంచ్ సౌజన్య రూ.15 వేలు, కాయల రంగయ్య రూ.10 వేలు, ఇసురాళ్ల లాలుస్వామి రూ.7,016, వడ్ల ఆచారి రూ.5,016 నగదు బహుమతులు అందజేస్తారని వెల్లడించారు. వివరాలకు 83090 06866, 99633 18902 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని చెన్నమ్మ సర్కిల్‌లోని సీతారామ దేవాలయం వద్ద ఆదివారం రాత్రి ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు మనోహర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మయసభ, శ్రీకృష్ణ పడక సీను, సుభద్రార్జున సీను, సత్య హరిశ్చంద్ర వారణాసి, కాటి సీను, డ్యాన్స్ మాస్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



అద్దాలు పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని అర్బన్: ఆవోపా ఫౌండర్ కె.ఆర్.క్రిష్ణయ్యశెట్టి 125వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆదోనిలోని వాసవీ కళ్యాణ మండపంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 125 మంది వృద్ధులకు పరీక్షలు చేసి, మందులు, కంటి అద్దాలు అందజేశారు. విశ్వభారతి ఆస్పత్రి సౌజన్యంతో వాటిని పంపిణీ చేసినట్లు ఆవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాకుబాల్‌నాగేష్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆవోపా నాయకులు శ్రీధర, ఈరన్నశెట్టి, టీజీ రాంప్రసాద్, మమతశ్రీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- పొలాలను పంటసాగుకు సిద్ధం చేస్తున్న రైతన్నలు
- ఇప్పటికే మట్టి నమూనాలు పూర్తి
- రైతు భరోసా కేంద్రాలకు చేరిన ఎరువులు



మట్టి నమునాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది, కౌతాళంలో పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం





రైతు భరోసా కేంద్రం వద్ద ఎరువులను దింపుతున్న దృశ్యం

కౌతాళం: రైతన్నలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను దుక్కిదున్ని చదును చేస్తున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలోనే వర్షాలు కురిశాయి. ఆ నెలలో సాధారణ వర్షపాతం 12.8 ఎంఎం కాగా 48.8ఎంఎం వర్షపాతం నమోదైంది. మే నెలలో సాధారణ వర్షపాతం 33.9 కాగా ఇప్పటికే 30 ఎంఎం వర్షపాతం నమోదైంది. దీంతో ఈనెలాఖరులోనే విత్తు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు విత్తనాలు సైతం కొనుగోలు చేస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు

వచ్చేనెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ప్రభుత్వం ముందస్తుగానే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తోంది. ఊరూరా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా వాటి పంపిణీకి చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆర్బీకేల్లో యూరియతో పాటు కాంప్లెక్స్ ఎరువుల్ని సిద్ధంగా ఉంచింది. త్వరలో విత్తనాలు కూడా రానున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన వారు రెండు రోజుల ముందు ఆర్బీకేల్లో పేరు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే 12వేల మెట్రిక్ టన్నుల ఎరువులు, 2లక్షల పత్తి ప్యాకెట్లు అవసరమని ఇండెంట్ పెట్టినట్లు ఏఓ శేషాద్రి తెలిపారు. నెలాఖరు నుంచి సబ్సిడీపై వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రెండు రోజుల ముందు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటే చాలని వెల్లడించారు.

పొలాన్ని సిద్ధం చేశాను



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. ఇందులో ఖరీఫ్‌లో పంట సాగు చేసేందుకు పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నించాను. తొలకరి వర్షం పడగానే విత్తనం వేస్తాను. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి వానలు ముందుగానే వస్తున్నాయి. పంటలు కూడా తొందరగానే చేతికి వస్తాయి.

– రామకృష్ణ, రైతు , కౌతాళం

పంటల సాగు ఇలా..

కౌతాళం మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 70 వేల ఎకరాలు. ఇందులో గతేడాది అత్యధికంగా రైతులు పత్తి పంట సాగు చేశారు. ఏకంగా 48వేల ఎకరాల పత్తి పంట వేయగా, 12వేల నుంచి 13వేల వరకు మిరప పంట సాగు చేశారు. అలాగే వరి పంటను 4,500 నుంచి 5వేల ఎకరాలు, వేరుశనగ పంటను 5 నుంచి 6 వందల ఎకరాల్లో, ఉల్లి, జొన్న, సజ్జ, మొక్కజొన్న తదితర పంటలు మరో 2వేల ఎకరాల వరకు సాగు చేశారు. ఈ ఏడాది కూడా దాదాపు అదే స్థాయిలో పంట సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు. గతేడాదిలాగే ఈ ఏడాది కూడా అత్యధికంగా రైతులు పత్తివేయనున్నారు. మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు.

ఆధ్యాత్మికం

వాయుపుత్రుడికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయ స్వామి దేవాలయాల్లో శనివారం భక్తుల సందడి కనిపించింది. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో, అగసలదిన్నెలోని అంజనేయస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. కౌతాళంలోని ఆంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు సైతం భక్తులతో కిక్కిరిశాయి.

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం



నగదు అందజేస్తున్న సీతారాంరెడ్డి

కౌతాళం: ఓబుళాపురం గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి దేవాలయానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరపున వైఎస్సార్‌సీపీ నేత సీతారాంరెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ సమక్షంలో శనివారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం తమ సొంత గ్రామమేనని ఏ గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఓబుళాపురం గ్రామస్తులు సీతారాంరెడ్డికి శాలువ పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణంలోని 22వ వార్డు ఎస్కేడీ కాలనీ కౌన్సిలర్ ఎస్.పి.లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జి నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 యేళ్ల క్రితం రూ.2100 డీడీ కట్టిన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా, పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు.గతంలో స్థలాలు దూరంగా ఉన్నాయనే కారణంతో పలువురు గృహాలు కట్టుకోలేకపోయారన్నారు. నేడు పట్టణం విస్తరించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకొస్తున్నారని చెప్పారు. మహానేత వైఎస్సార్ హయాంలో పేదల కోసం 70 ఎకరాలను కొనుగోలు చేసి అందులో ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు.

డెంగీ నివారణపై అవగాహన



నందవరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నందవరం: డెంగీ నివారణ చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎమ్మిగనూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహులు, సీహెచ్ఓ బలరాం నేతృత్వంలో దోమలు, ల్యార్వా నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. డ్రైయినేజీలు, కాలువలు, నీటి కుంటలు, తొట్టెలలో యాంటీ లార్వా ద్రావణాన్ని పారిశుద్ధ్య కార్మికులతో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమలను నివారించాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, మురుగు కాలువలు, నీటి కుంటలు, నీటి తొట్టెలు, రబ్బర్ ట్యూబ్‌లు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి వారం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

నడవలయ్య స్వామికి వెండి కవచం



వెండి కవచాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండపై వెలసిన నడవలయ్య స్వామికి భక్తుల సహకారంతో 22 కేజీల వెండి కవచం చేయించారు. శనివారం సాయంత్రం పట్టణంలో నాయకుడు వై.పురుషోత్తంగౌడ్ ఇంటి నుంచి వెండి కవచాన్ని ఊరేగింపుగా గుడేకల్‌కు తీసుకెళ్లారు. స్వామివారికి 22 కేజీల వెండి కవచం, 2 కేజీల వెండి బిందె, మూడున్నర తులాల బంగారు బిల్లను భక్తులు, గ్రామస్తుల సహకారంతో చేయించారు. ఊరేగింపులో డాక్టర్ నవీన్‌కుమార్‌గౌడ్‌తో పాటు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.15.80 కోట్లతో మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు

- రూ.4.75 కోట్లతో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణ
- రేపు క్షేత్రస్థాయిలో నాబార్డు బృందం పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో నాబార్డు నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో రూ.15.80 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.33 లక్షలతో వివిధ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డు నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో చేపట్టబోయే పనులను ఈ నెల 15న నాబార్డు సీనియర్ అధికారుల బృందం పరిశీలించనుంది. నాబార్డు అధికారుల క్షేత్రస్థాయి పర్యటన తర్వాత నిధులు విడుదల అవుతాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో తాగు నీటి సదుపాయాన్ని మరింత మెరుగుపరిచేందుకు రూ.10 లక్షలు, కర్నూలు మార్కెట్‌లో పరిపాలన భవనం, టెండరు హాల్, రైతు విశ్రాంతి భవనం ఆధునీకరణకు రూ.30 లక్షలు, జంబోషెడ్ నిర్మాణానికి రూ.6 కోట్లు, టాయ్‌లెట్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయనున్నారు. అలాగే కర్నూలు సీ.క్యాంపు రైతుబజారు విస్తరణకు రూ.4.75 కోట్లు, గూడూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కాంపౌండు వాల్ నిర్మాణానికి రూ.కోటి, కోడుమూరు మార్కెట్ యార్డు కంపౌండువాల్ నిర్మాణానికి రూ.కోటి ప్రకారం నిధులు మంజూరు కానున్నాయి. అమడగుంట్ల, బసాపురం, జి.సింగవరం, రేమట, ఉల్చాల గ్రామాల్లో మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు రూ.11 లక్షలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో జంబోషెడ్ నిర్మాణానికి రూ.2 కోట్లు ప్రకారం నాబార్డు నిధులు మంజూరు చేయనుంది. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం మండ్లెం, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-1, పాములపాడు-2ల్లో గోదాముల నిర్మాణాలకు రూ.11 లక్షల ప్రకారం నిధులు మంజూరు కానున్నాయి. ఈ నెల 15న నాబార్డు టీమ్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ, సీ.క్యాంపు రైతుబజారు, కోడుమూరు, ఎమ్మిగనూరులలో పర్యటించనున్నట్లుగా మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు వచ్చేసింది!



నాడు నడవడానికి వీలులేకుండా ఉన్న దారి



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో కింద మారెమ్మ దేవి ఆలయ సమీపంలో 4 వ వార్డు పరిధిలో కొత్త పేట కాలనీ ఉంది. ఈకాలనీలో దాదాపు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలోకి వెళ్లాలంటే మెట్లు ఎక్కి దిగిపోవాలి. ద్విచక్రవాహనాలు లోపలికి వెళ్లలేని పరిస్థితి. హిందుబాలికల పాఠశాల ముందు భాగం నుంచి తమ కాలనీకి రోడ్డు వేయించాలని స్థానికులు పలుమార్లు గత పాలకులను విన్నవించుకున్నారు. వారెవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుత ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోడ్డు వేయించాలని కోరారు. కాలనీవాసులు విన్నపం మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ.8 లక్షలు వెచ్చించి రోడ్డు వేయించారు. చాలా ఏళ్ల తర్వాత రోడ్డు ఏర్పాటు కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ బోల్తా



కంబలదిన్ని గ్రామంలో బోల్తాపడ్డ ట్రాక్టర్

పెద్దకడబూరు: వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామంలో శనివారం అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర, స్థానికులు తెలిపిన వివరాల మేరకు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన రైతులు రమేష్, తిమ్మప్ప, సోమప్ప, ఆంజనేయలు ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో పశుగ్రాసం కొనుగోలు చేశారు. శనివారం ఉదయం ట్రాక్టర్‌తో వెళ్లి గడ్డిని లోడ్ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఎమ్మిగనూరు - మాలపల్లి ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ట్రాక్టర్ కంబలదిన్ని గ్రామం రాగానే ప్రధాన రహదారి పైనే బోల్తా పడింది. ట్రాక్టర్ పై ఉన్న నలుగురు రైతులు అప్రమత్తమై కిందికి దూకడంతో చిన్న చిన్న గాయాలతో భయటపడ్డారు. కాగా ఈ రహదారి సరిగ్గా లేదని అధికారులు స్పందించిబాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ముగిసిన చందన యాత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో ఉత్సవ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో నిర్వహిస్తున్న జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు -2023 శనివారం ముగిశాయి. గత నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజున ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభుదాస్ భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

జాబ్‌మేళా పోస్టర్ల విడుదల

కర్నూలు సిటీ: ఈనెల 16న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే ఎం.ఏ హఫీజ్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉపాధి, కల్పన శాఖ అధికారి సోమశివరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమా, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగ యువతి, యువకులు అర్హులన్నారు. గ్రీన్‌టెక్, హెటిరో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియో మార్ట్, హీల్ మై ఫ్యామిలీ, ముత్తూట్ ఫైనాన్స్, బీఎంఎస్ సెక్యూరిటీస్, వన్ పాయింట్..వన్ సొల్యూషన్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు htt pr./bit.y/3poxiv వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8309283980, 6300009183 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీడాప్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

ఏపీ సీఎం కప్ విజేతలకు సత్కారం

కర్నూలు (టౌన్): ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని ఎస్వీ యూనివర్సిటీ క్రీడామైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో రన్నరప్ చాంపియన్‌షిప్ సాధించారు. అలాగే 61 కేజీల విభాగంలో ఎస్.అబ్దుల్లా బంగారు, బి.వీరేష్ కాంస్యం సాధించారు. 49 కేజీల విభాగంలో జి.తులసీ కాంస్యం, 71 కేజీల విభాగంలో ఎం.పుష్పాంజలి కాంస్యం, 87 కేజీల విభాగంలో ఏ.నాగమణి కాంస్యం, 102 కేజీల విభాగంలో పర్వేజ్ ముష్రాఫ్ బంగారు, 67 కేజీల విభాగంలో అబ్దుల్ హక్ వెండి, 102 కేజీల విభాగంలో గురు చిద్విలాస్ కాంస్యం సాధించారు. వీరితో పాటు కోచ్ యూసుఫ్‌లను న్యాయవాది శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి



ఏఆర్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ

కర్నూలు: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించి పోలీసులు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులకు జిల్లా పోలీసు కార్యాలయంలో హెల్మెట్‌పై శనివారం ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు వీఎస్ రమణ, పోతురాజు, శివారెడ్డితో పాటు ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తికి గాయాలు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్నేహళ్లి గ్రామానికి చెందిన వి.వెంకటేశ్ గాయపడ్డారు. స్వ గ్రామం నుంచి ఎమ్మిగనూరు మీదుగా కర్నూలుకు వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. బైక్ అదుపుతప్పి కల్వర్టు గుంతలో పడటంతో వెంకటేశ్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని రూరల్: పట్టణానికి చెందిన ఎ.ఉమాదేవి అనే మహిళ వద్ద 32 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. ఉమాదేవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఎవరైనా కర్ణాటక మద్యాన్ని కలిగి ఉన్నా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో రెండిళ్లలో చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ చోరీ వివరాలు ఇలా.. కాలనీకి చెందిన టీచర్లు రమేష్‌నాయుడు, సుధాకర్ మూడు, నాలుగు రోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు వెళ్లారు. గమనించిన దొంగలు వారిద్దరి ఇళ్లలో చొరబడి అందినకాడికి దోచుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన సదరు టీచర్లు తెరిచి ఉన్న ఇంటిని, బీరువాను చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రమేష్‌నాయుడు అనే ఉపాధ్యాయుడి ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు, ఒక తులం వెండి, రూ.7 వేలు నగదు, సుధాకర్ ఇంట్లో రెండు తు లాల బంగారం చోరీకి గురైనట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కోలుకోలేక విద్యార్థి మృతి

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బీటెక్ విద్యార్థి దూదేకుల మన్సూర్ (21) మృతిచెందాడు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కృష్ణారావుపేటకు చెందిన మాలిక్ బాషాకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు మన్సూర్ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ యాజమాన్యం సెలవు ప్రకటించడంతో వారం క్రితం స్వగ్రామానికి వెళ్లాడు. శుక్రవారం కర్నూలులో స్నేహితుని పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు వచ్చి మరో స్నేహితుడు రేవంత్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై పంచలింగాల వద్ద ఉన్న దాబాకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి కర్నూలుకు వస్తూ చౌరస్తా ఆంజనేయస్వామి గుడి వెనుక సర్వీస్ రోడ్డులో ఆగివున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో మన్సూర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. శనివారం తండ్రి మాలిక్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్లపై కేసులు

హొళగుంద: రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తూ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మరో 11 మంది ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సదరు డ్రైవర్లు రోడ్లపై, గ్రామాలలో అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతున్నారని దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఆరుగురిపై కేసులు నమోదు చేయగా శనివారం మరో 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.